కథ

# బుడిగిగాడి డిస్కవరీ

- రాంరళ్ళి



**చంటీ, వెంటీ, చిట్టీ–పొట్టీ, బుజ్జీ–బుడిగీ... ఇలా ముద్దు పేర్లతో పిలవబడే రామదండు మేళం వంటి మనుమలూ–మనుమరాండ్రుతో రామానుజంగారిల్లు కిటకిట లాడుతోంది.**

అందరూ కొత్తగా వచ్చిన కలర్ టీ.వీ. ముందు చేరారు.

పవర్ కట్‌నీ–ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌నీ తిట్టారు.

సరిగ్గా ఎనిమిదయ్యేసరికి కరెంటొచ్చింది.

టీ.వీ. మెకానిక్ టీ.వీ.ని ఆన్ చేసెళ్ళాడు.

కేబుల్ ఆపరేటర్ కనెక్షనిచ్చి, అన్ని ఛానల్స్ సెట్ చేసేల్లాడు.

ఇక చూస్కోండి ! ఇల్లాంతా సందడే సందడి!! పిల్లలంతా ఒకటే గోల!

ఎవరోగాని తామరాకుపై నీటి బొట్టులా అంటీ అంటనట్టు–ముట్టీముట్టనట్టుండలేరు. అందులో రామానుజం దంపతుల మరీను.

వేసవి సెలవులివ్వగానే, సంవత్సరానికోసారైనా... కూతుళ్లూ–అల్లుళ్లూ, మనుమలూ–మనవరాళ్లూ తమ ఇంటి కొచ్చి పది రోజుల పాటుండెళ్లాలని వాళ్లు కోరుకుంటారు. తమకి కలిగిందాంట్లో తామిచ్చింది వాళ్లు పట్టుకెళ్లాలనుకుంటారు. అందుకోసం వాళ్లేడాదంతా కష్టపడి, తినీ తినకా కూడబెడతారు. ఆ కూడబెట్టిందంతా పిల్లలానందం కోసం రెప్పపాటులో ఖర్చుచేసి తృప్తి పొందుతారు. అప్పట్నించీ వేసవి సెలవులొచ్చేదాకా వాళ్లకి గానుగెద్దు చాకిరీ మామూలే!

'ఈ టీవీ' ప్రోగ్రాం చూద్దామన్నాడు పెద్దల్లుడు.

'స్టార్ మూవీ' బావుంటుందన్నాడు చిన్నల్లుడు.

'జెమినీ టీవీ' పెట్టండోయ్!' అన్నాడు రెండో అల్లుడు.

'వీడియో అద్దెకి తెచ్చుకుందాం! మనకి నచ్చిన క్యాసెట్లు చూడొచ్చు' అన్నాడు మూడో అల్లుడు.

అతనికి రహస్యంగా బ్లూ ఫిల్ములు చూసే అలవాటుంది. కూడా కొన్ని క్యాసెట్లని తెచ్చుకున్నాడతను. అందరూ నిద్రపోయాక వాటిని ప్లేచేసి చూడాలనుకుంటున్నాడతను.

ఇలా అందరూ మాట్లాడుకుంటూ రిమోట్‌తో ఛానెల్స్‌ని మార్చేస్తున్నారు. రిమోట్ ఒకరి చేతిలోంచి మరొకరి చేతిలో కెళ్లిపోతోంది.

ఒక ఛానెల్లో కార్టూన్ షో వస్తుంది.

బుడిగి ఒక్కసారి గట్టిగా అరిచాడు– 'నాకదే! ఆ కార్టూన్ షోయే కావాలి. ఎవరూ మార్చొద్దు' ఆర్డరేశాడు వాడు.

'ఛ! కార్టూన్లే చూస్తావ్!? చక్కగా ఏదైనా సిన్మా వస్తుం ది చూద్దాం!' ఛానెల్‌ని మార్చేశారెవరో.

బుడిగి పెంకు లెగిరేలా రాగం తీశాడు. "ఛ! నన్ను చూడనివ్వడు. ఆ కార్టూన్ షో అయిపోతుంది. ఎంతసేపో వుండదది

వాడి ఏడుపు విని భరించలేకపోతున్నారు. అందరి కన్నా చిన్నాడు బుడిగి– తాతగారు వాడిమీద ఈగవాలనివ్వడు. అందరికీ వాడంటే ప్రేమే

బుడిగి కోరిక మేరకు కార్టూన్ షో పెట్టారు.

ఒక్క నిమిషంలో కార్టూన్ షో కాస్తా పూర్తయింది. ఆ తర్వాతేదో చెత్తా చెదారం వస్తోంది.

మరో ఛానెల్‌లో కార్టూన్ షో వుంటుందని చెప్పి బుడిగి రిమోట్‌ను లాక్కున్నాడు.

వాడన్ని ఛానెల్స్‌నీ నొక్కేస్తున్నాడు రిమోట్‌తో. వాడి చేతిలోంచి రిమోట్ లాక్కోబోతే, కిందపడి పగుల్తుందనే. భయంతో, ఎవరూ వాడి దగ్గర కెళ్లటల్లేదు.

వాడికి డిస్కవరీ ఛానెల్ తగిలింది. వాడి కది నచ్చినట్టుంది.

ఏనుగులూ–పులులూ–సింహాల్ని చూసి వాడు ఆనందంతో కేరింతలు కొడుతున్నాడు.

'నాకీ ఛానెలే బావుంది. నేనిదే చూస్తాను' అంటూ వాడు ఎవరూ లాక్కోకుండా రిమోట్‌ని చంకలో యిరికించుకున్నాడు.

'పోన్లెండ్రా! వాడు చిన్నాడు. వాడేం చూడాలనుకుంటే, దాన్నే మీరు చూడండ్రా!!' అన్నాడు రామానుజం దంపతులు.

ఛానెల్లో రకరకాల పాముల్ని చూపిస్తున్నారు. ఒడలు గగుర్పొడిచేలాగున్నాయా పాములు.

'వెధవది! పాములవీ చూసి ఝుడుసుకుంటావ్! ఛానెల్ని మార్చరా వెధవా!!" అరిచాడొకరు.

'నాకేం భయ్యం లేదు. అవన్నీ బొమ్మలేగా! నేనేం ఝుడుసుకోను' అన్నాడు బుడిగి.

అదేదో వింత జంతువుని ఛానెల్లో చూపారు. ఇంగ్లీషులో ఆ జంతువు పేరేదో చెబుతున్నారు.

'ఒరే! అదేం జంతువురా?!'

'డయనోసిరాస్!'

'డైనోసిరాస్ కాదని! నేను జూరాసిస్ పార్క్ సిన్మా చూశా. డైనోసిరాసలాగుండదు'.

మాటలు సాగుతున్నాయి.

'వెధవ జంతువులు. అదే జంతువైతే మనకేం?! దాన్ని చూస్తుంటే ఒళ్లు జలదరిస్తోంది. ఛానెల్ మార్చరా! ఏ సిన్మా పాటలో చూద్దాం!' అంది రామనుజంగారి భార్య సుభద్రమ్మ.

'లేదమ్మమ్మా! ఆ జంతువుని చూస్తుంటే మొసలి లాగుంది కదమ్మమ్మా!' అన్నాడు బుడిగి.

'కాదు. పెద్ద తొండ లాగుంది. దాని వొంటిమీద గరుగ్గా మొసలి ముళ్లున్నాట్లుంది'

'ఏడిశావ్! తొండ మెడ కాద్దానిది. పెద్ద వల్లి గెళ్లపాములాగుంది!"

'అయ్యబాబోయ్! అది దాన్నోట్లోంచి వాలికని



ఎంత పొడుగ్గా సాగదీస్తోందో చూడ్రా!'

'అరె! అది నాలుగు కాళ్లతో జర జరా పాకేస్తోందిరా!'

'కాళ్లతో పాకడమేంటి? నడుస్తోంది!

'బలమైన పెద్ద తోకవేలా జాడిస్తుందో చూడు. ఆ తోకతో కొట్టిందంటే ఢామ్మని ఛస్తాం!'

'తోకతో కొట్టదది. నడిచేటందుకు తోకనుప యోగించుకుంటుందది!'

'ఒరేయ్! నీళ్లల్లో అది మొసలిలా ఈత్తోందిరా?! అదిగో... నీళ్లలో ఈదేటందుకది తోకనుపయోగ స్తోంది!'

"సర్లెంద్రా! అది బల్లీ–పల్లి గిళ్లపామూ, తొండా– మొసలీ అన్నీ కలగలపిన ఓ కొత్త జంతువు. దాన్ని చూస్తుంటేనే భయమేస్తోంది! ఆ ఛానెల్ని మార్చరా నాయనా!' అంది సుభద్రమ్మ.

"అమ్మమ్మా చూడు! అది నాలికని చాస్తూ లేడి దగ్గరకెడుతోంది. పాపం! అదిగాని లేడిని చంపేస్తుందేమో?! అదేం టమ్మమ్మా?! ఆ లేడి పరిగెత్తదేం?! ఇంకా అక్కడే నించుందేం?!"

"ఎలా పరిగెడుతుందిరా?! పాపమా లేడి కాలుగాని బెణికిందో ఏంపాడో!?"

"లేడి కాలుమీద వుండుందమ్మమ్మా! అందుకే అది పరిగెత్తటల్లేదు."

'అరె? లేడి కాల్నుపట్టది కొరుకుతోందమ్మమ్మా! పాపమా లేడి 'బే... బే...' అనరుస్తోందమ్మమ్మా!'

'పాపం... ఆ లేడి ఎంత బాధపడుతోందో? ప్చ్...'

"లేడి నేలమీద కూలబడిపోయిందమ్మమ్మా! ఆ పెద్దబల్లికి తోడుగా మరిన్ని పెద్ద బల్లులొచ్చాయమ్మమ్మా! ఆ లేడి కోసం ఆ పెద్దబల్లులు వాటిలో అవి దెబ్బలాడుకుంటున్నాయమ్మమ్మా!"

"చూస్తున్నాన్లేరా! నువ్వేం నాకు చెప్పక్కర్లా."

"అరే! ఆ లేడి కాల్నించి చర్మంతో సహా కండ లాక్కుని పెద్ద బల్లి ఎలా కొరుక్కు తినేస్తోందో చూడమ్మమ్మా?!" అంటూ బుడిగి గావ్వేద్చాడు.

"అలాగేడుస్తూ చూడక పోతేనేం?! ఛానెల్ని మార్చరా వెధవా!" అని బుడిగిని కసురుకుంది వాళ్ల అమ్మ.

"నీకు మాత్రం ఏడుపు రావట్లేదేంటి?! అవున్లే! నీ కెందుకెడ్వొస్తుంది?! బతికిఉండావే కండలు పీక్కుతినే ఆ బల్లిని చూస్తే నాకేం గుర్తొస్తోందో తెల్సా!? పాపం! ఆ లేడీమో తాతయ్యా–అమ్మమ్మనూ! ఆ కండలు పీక్కుతినే బల్లులేమో నువ్వూ–నాన్నా, బాబైలూ– పిన్నులూ! ఇంకా పెద నాన్నా–పెద్దమ్మా– మీరందరూను" అంటూ భోరు మెద్దేవాడు బుడిగి.

"బోడి డిస్కవరీ–నువ్వూనూ! నోర్మూయ్యరా వేధవా!" అంటూ బుడిగ నొక్కటంటిద్దామని లేచింది వాళ్లమ్మ.

'ఉండవే! పోన్లేవే! వాడేదో తెలీకన్నాడు. మీరంతా వొస్తున్నారని... మీ కోసమని, కొట్టు వాడ్ని బతిమిలాడి... రోజుకి రెండొందలకి ఆ కలర్ టీ.వీ.ని మీ నాన్న అద్దెకి తెచ్చాడు. కేబుల్‌వాడి కో వంద పారేసి కనెక్షన్ తీసుకున్నారు. మీరెళ్లగానే ఆ కలర్ టీ.వీ.–కేబుల్ వైభోగం అన్నీ పోతాయి. ఆ కలర్ టీ.వీ. కోసం మీరంతా పొట్లాడుకో వడం చూసి వాడలాగనుంటాడు. అంతే కదురా బుడిగీ!" అంది సుభద్రమ్మ.

"ఒరి తాతా!! నేనంటే నీ కెంత ప్రేమరా?!' అంటూ రంగనాధంగారు బుడిగిని ఒళ్లోకి లాక్కుని, బుగ్గలు పుణికి ముద్దాడారు.

బుడిగ్గాడి డిస్కవరీతో రంగనాధంగారి కూతుళ్లకీ–అల్లుళ్లకీ జ్ఞానోదయమైంది. ఇన్నాళ్లూ రంగనాధం దంపతుల గూర్చి పట్టించుకోనందుకు వాళ్లెంతో యిదయ్యారు. ఈ వేసవి శెలవల్లో వాళ్లేవో కావాలన్చెప్పి రంగనాధంగారి దగ్గర పట్టు పట్టలేదు. పైగా... వాళ్లే వద్దన్నా వినకుండా రంగనాధం దంపతులకి బట్టలు పెట్టారు. ఖర్చుల కన్చెప్పి తమకి తోచిందిచ్చారు.

కరిపించుకునే లేళ్లకి కరిపించుకోవటంలోనే సరదా వుంటుంది!?

తమ పిల్లలూ– ఆ పిల్లల పిల్లలూ... వాళ్లపై వుండే ప్రేమానురాగాలకు ఎల్లలుండవనుకుంటాను.

అందుకే... రంగనాధం దంపతులాడబ్బుల్తో అందరికీ బట్టలు పెట్టి పంపారు. మర్నాటినించీ కష్టపడి మళ్లీ ఏటికి కూడబెట్టగలమనే ధైర్యం ఆ దంపతులకుంది మరి!!?